ప్రొఫైల్

న్యాయవిద్య-పరిశోధనల తలమానికం

'నల్సార్'

న్యాయ విద్య, పరిశోధన రంగాల్లో దేశంలోనే ఎన్నదగినది 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, హైదరాబాద్'. దీనిని 1998వ సంవత్సరంలో 'జాతీయ న్యాయ అధ్యయన, పరిశోధనాంశాల సంస్థ చట్టం'(ఆంధ్రప్రదేశ్ చట్టం 34, 1998) కింద ఏర్పాటు చేశారు. అది పూర్తిగా రెసిడెన్షియల్ యూనివర్సిటీ. న్యాయ విద్యలో నూతన ప్రమాణాలను నెలకొల్పడం, న్యాయవాద వృత్తిలో అపరిమిత అవకాశాలను శోధించడం ఈ యూనివర్సిటీ కార్యక్రమాలు. న్యాయశాస్త్రం, దాని అనుబంధ శాస్త్రాల్లో పరిశోధనను నల్సార్ ప్రోత్సహిస్తుంది. అత్యున్నత ప్రమాణాలు కలిగిన న్యాయవాదులను తయారు చేయడం, సామాజిక బాధ్యత కలిగిన బాధ్యతాయత పౌరులను సమాజానికి అందించడం ధ్యేయంగా తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

నల్సార్ ఉద్దేశ్యాలు

- అత్యున్నత ప్రమాణాలతో కూడిన సమగ్ర న్యాయ విద్యను అందించడం.
- న్యాయశాస్త్ర విభాగాల్లో నూతన అధ్యయనం, పరిశోధనలకు వీలు కల్పించడం.
- సమన్యాయ పాలన దిశలో రాజ్యాంగ లక్ష్యాల సాధన.. చట్ట, సాంస్కృతిక, నైతిక విలువలను పాదుకొల్పడం.
- విస్తృత సామాజిక, ఆర్థిక న్యాయ సాధన దిశలో న్యాయ చైతన్యాన్ని రగల్చడం.

బోధన పద్ధతులు

తరగతి గది బోధన, సదస్సులు, మూట్ కోర్ట్ లాంటి విధానాలను నల్సార్ అనుసరిస్తుంది. ఒక్కో విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తుంది. విద్యార్థుల్లో పరస్పర చర్చలను ప్రోత్సహిస్తుంది. వారికి కావాల్సిన బోధనా సామగ్రిని సమకూరుస్తుంది. ప్రాజెక్ట్ అసైన్‌మెంట్ల ద్వారా తన విద్యార్థుల్లో పఠన, పరిశోధన, విశ్లేషణ, రాత నైపుణ్యాలను పెంపొందిస్తుంది.

క్యాంపస్ వసతులు

హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేట వద్ద 'నల్సార్' క్యాంపస్‌ను విశాలమైన స్థలంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా నాలుగు రెసిడెన్స్ హాల్స్ ఉన్నాయి. వాటిలో వై-ఫై సౌకర్యాలున్నాయి. అత్యంత ముఖ్యమైన పుస్తకాలు, జర్నల్స్, ఈ-డాటా బేస్ క్యాంపస్‌లోని గ్రంథాలయంలో లభిస్తాయి. వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యం కలిగిన అద్భుతమైన మూట్‌కోర్ట్ హాల్ ఉంది. (ఇది హైకోర్టు, సుప్రీం కోర్టు హాల్స్ కన్నా బావుంటుంది. అనేక మంది న్యాయమూర్తులు ఆ విషయమై ప్రశంసించారు కూడా!) ఇండోర్, ఔట్ డోర్ క్రీడల కోసం సొంత స్టేడియం ఉంది.

పరిశోధన

విధాన నిర్ణయ ప్రక్రియ, బోధన, అభ్యసనం బలోపేతమయ్యే రీతిలో పరిశోధన ఉంటుంది. దేశంలో న్యాయం, మానవ హక్కులను బలోపేతం చేసే విధంగానూ ప్రజలను ప్రభావితం చేసే రీతిలోనూ పరిశోధనలకు నల్సార్ పెద్ద పీట వేస్తుంది. బాలల హక్కులు, మహిళా హక్కులు, పర్యావరణ పరిరక్షణ, సమాజంలోని వివిధ వర్గాల మధ్య భాగస్వామ్యం, తదితర విధాన నిర్ణయాలకు మార్గదర్శకాలను రూపొందించడం లక్ష్యంగా పరిశోధనా కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది.

అంతర్జాతీయ మార్పిడి

అనేక దేశాలతో, విశ్వ విద్యాలయాలతో నల్సార్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. అమెరికా, ఇంగ్లండ్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సింగపూర్, ఇజ్రాయెల్, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లోని 16 విశ్వవిద్యాలయాలతో కుదుర్చుకొన్న ఒప్పందంలో భాగంగా విద్యార్థులు, బోధనా సిబ్బంది మార్పిడితో పాటు పరిశోధనా రంగాల్లో పరస్పర సహకారం అందిపుచ్చుకుంటుంది.

కోర్సులు

బి.ఎ.,(ఎల్‌ఎల్‌బి)-ఆనర్స్

కాల పరిమితి: అయిదేళ్లు. 10+2 విధానంలో విద్యను పూర్తి చేసిన అభ్యర్థులు దానికి అర్హులు. వారు అందులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. క్లాట్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులు నేరుగా నల్సార్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చు. నిబంధనలను అనుసరించి సీట్లలో రిజర్వేషన్లున్నాయి. ఇంకా..ఎల్ఎల్ఎం, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు సైతం నల్సార్‌లో అందుబాటులో ఉన్నాయి.(www.nalsar.ac.in)

– ఎల్లెస్

నల్సార్ ప్రాక్సీమేట్ ఎడ్యుకేషన్

ఆచార్య మాడభూషి శ్రీధర్

క్యాంపస్‌లో విద్యాభ్యాసం చేయలేని వారి కోసం నల్సార్ వివిధ కోర్సులను దూర విద్యావిధానంలో అందించేందుకు 'నల్సార్ ప్రాక్సీమేట్ ఎడ్యుకేషన్'ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అది పేటెంట్స్ లాస్, సైబర్ లాస్, మీడియా లాస్, ఇంటర్నేషనల్ హ్యూమనిటేరియన్ లాస్‌లలో ఏడాది కాలపరిమతి కల పీజీ డిప్లొమాలను అందిస్తోంది. వెబ్ ఆధారితంగానూ, కాంటాక్టు క్లాసుల ద్వారానూ ప్రాక్సీమేట్ ఎడ్యుకేషన్ అందిస్తున్న కోర్సులకు దేశంలో బహుళ ఆదరణ లభిస్తోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో విద్యార్థులకు ఆయా కోర్సులను అభ్యసించే వీలుంది. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందిస్తుంది. విద్యార్థులు 'ప్రాక్సీమేట్' వెబ్‌సైట్‌లోని సమాచారాన్ని వినియోగించుకునేందుకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ సౌకర్యాన్ని అందిస్తోంది. ఇంకా..రెండేళ్ల కాలపరిమితి కలిగిన మాస్టర్స్ డిగ్రీ (టాక్సేషన్ అండ్ బిజినెస్ లాస్) అందిస్తోంది. అయితే దానికి కేవలం 'నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్'కు చెందిన ప్రొబేషనర్స్‌కు మాత్రమే పరిమితం చేసింది. మన రాష్ట్రానికి చెందిన సీనియర్ పత్రికా రచయిత, న్యాయశాస్త్రాచార్యులు, డాక్టర్ మాడభూషి శ్రీధర్ 'నల్సార్ ప్రాక్సీమేట్ ఎడ్యుకేషన్'కు సమన్వయకర్తగా వ్యవహరిస్తుండడం విశేషం! ప్రాక్సీమేట్‌లో మరిన్ని కొత్త కోర్సుల రూపకల్పన దిశలో ఆయన కృషి చేస్తున్నారు. పత్రికా రంగంలో సొంత ఒరవడి సృష్టించుకున్న శ్రీధర్ 'ప్రాక్సీమేట్'ను జాతీయ, అంతర్జాతీయంగా ఎన్నదగిన సంస్థగా తీర్చి దిద్దే యజ్ఞంలో సఫలీకృతం అవుతారనడంలో సందేహం లేదు. *(www.nalsar pro.org)*

అడ్మిషన్లు

'ఇగ్నో'లో వివిధ కోర్సుల ప్రవేశ ప్రకటన

ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)లో జనవరి-2010 సెషన్ కోసం వివిధ పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గానూ ఆ విశ్వ విద్యాలయం ప్రకటన జారీ చేసింది.

పీజీ డిప్లొమా కోర్సులు:

ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్

అర్హత: ఫుడ్ సైన్స్, అగ్రికల్చర్, డైరీ, వెటర్నరీ, ఫిషరీస్, హోమ్ సైన్స్, హోటల్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ లేదా కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీల్లో ఏదో ఒక సబ్జెక్టుతో బీఎస్సీ పూర్తి చేసి ఉండాలి.

ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్

అర్హత: ఏదైనా డిగ్రీ

అగ్రికల్చర్ పాలసీ

అర్హత: ఏదేనీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి

చేసి ఉండాలి.

డిప్లొమా కోర్సులు

వ్యాల్యూ యాడెడ్ ప్రొడక్ట్స్ ఫ్రమ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్, డైరీ టెక్నాలజీ, మీట్ టెక్నాలజీ, ప్రొడక్షన్ వ్యాల్యూ యాడెడ్ ప్రొడక్ట్స్ ఫ్రమ్ పల్సెస్ అండ్ ఆయిల్ సీడ్స్, ఫిష్ ప్రొడక్షన్ టెక్నాలజీ, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్

అర్హత: ఇంటర్మీడియెట్ లేదా పదో తరగతి ఉత్తీర్ణులయితే ఇగ్నో బీపీసీ కోర్సులో చేరాల్సి ఉంటుంది.

సర్టిఫికేట్ కోర్సులు

ఆర్గానిక్ ఫామింగ్

అర్హత: ఇంటర్మీడియెట్ లేదా ఇగ్నో బీపీపీ

సెరికల్చర్

అర్హత: టెన్త్ పాస్

బీ కీపింగ్

అర్హత: ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత

పౌల్ట్రీ ఫామింగ్

అర్హత: ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో గ్రామీణ విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు 50 శాతం ఫీజులో రాయితీని అందిస్తారు.

దరఖాస్తులు: ఇగ్నో ప్రాంతీయ కేంద్రాల్లో 100 రూపాయలు చెల్లించి నేరుగా దరఖాస్తులు పొందవచ్చు. లేదా 'ఇగ్నో' పేరిట 150 రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్ తీసి 'ద రిజిస్ట్రార్, ఎస్ఆర్‌డి, ఇగ్నో మైదాన్ గఢి, న్యూఢిల్లీ-110 068' చిరునామాకు పంపించి పొందవచ్చు. దరఖాస్తులను ఇగ్నో వెబ్‌సైట్ నుంచి పొందేందుకు వీలుంది.

దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ: 31 అక్టోబర్, 2009.

వెబ్‌సైట్: www.ignou.ac.in

మద్రాస్ ఐఐటీ ప్రకటన

దిగువ పేర్కొన్న వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ, ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశం కోసం 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్' ప్రకటన విడుదల చేసింది. ఏరో స్పేస్, అప్లయిడ్ మెకానిక్స్, బయో టెక్నాలజీ, కెమికల్, కెమిస్ట్రీ, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ డిజైన్, హ్యుమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మ్యాథమేటిక్స్, మెకానికల్, మెటలర్జీ అండ్ మెటీరియల్స్.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వార మాత్రమే

చివరి తేదీ: 23 అక్టోబర్, 2009. **వెబ్‌సైట్:** www.iitm.ac.in

వెబ్ వాచ్

'టోఫెల్' సర్వస్వం

ప్రపంచ వ్యాప్తంగా 'టోఫెల్' పరీక్షకు ఉన్న ప్రాధాన్యత అందరికీ తెలిసిందే! మొత్తం 130 దేశాల్లోని ఏడువేలకు పైగా ప్రసిద్ధి పొందిన విద్యాలయాలు టోఫెల్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. విదేశాల్లో విద్యనభ్యసించడం చిరకాల వాంఛగా ఉన్నవారు టోఫెల్‌ను అశ్రద్ధ చేసేందుకు వీలు లేదు. అలాంటి ఔత్సాహిక అభ్యర్థులకు ఎనలేని ప్రయోజనాన్ని కలిగించే దిశలో కృషి చేస్తున్న ఒక వెబ్‌సైట్ ఉంది. దాని చిరునామా www.toeflgoanywhere.org

ఆ సైట్‌ను ఓపెన్ చేయగానే ఆహ్లాదంగా ఉంటుంది. లేఅవుట్ చక్కగా, రీడర్ ఫ్రెండ్లీగా ఉంటుంది. బేసిక్ రంగులను ఉపయోగించారు. ఫాంట్‌లు పెద్దగా, స్పష్టంగా చదివేందుకు వీలుగా రూపొందించారు. సైట్‌లో వీక్షకులను గందరగోళపరిచే రకరకాల పాప్‌అప్స్, వెబ్ లింకులు ఉండవు. హోమ్‌పేజీలోని పైభాగంలో ఒక బ్లూ బార్ ఉంటుంది. దానిలో మూడు ప్రధాన భాగాలు ఉంటాయి. అవి.. Prepare and Practice, TOEFL@step-by-step,TOEFL@ advantage.



మొదటి విభాగంలో ఆకర్షించేది వీడియో. దానిని చూడగానే క్లిక్‌మన్పించక మానరు. ఆ విభాగంలో ద్వితీయ భాషగా ఇంగ్లిష్ ప్రాధాన్యతను వివరించే వీడియోలు కన్పిస్తాయి. కానీ, అవి త్వరగా ఓపెన్ కాకపోవడం కాస్త ఇబ్బంది పెట్టే అంశం. అదే విభాగంలో టోఫెల్ నమూనా ప్రశ్నలు పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఉంటాయి. వాటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనే వీలుంది. టోఫెల్ పరీక్షకు ఉపయుక్తమయ్యే గైడ్లు కొనాలని భావిస్తే- అక్కడ అవి లభిస్తాయి.

ఇక టోఫెల్ పరీక్ష గురించి వివరంగా TOEFL@step-by-step వివరిస్తుంది. టోఫెల్ స్కోర్ ప్రాధాన్యతలతో పాటు అత్యంత ముఖ్యమైన సమాచారం ఉంటుంది. టోఫెల్ అభ్యర్థుల సందేహాలను దృష్టిలో పెట్టుకొని 'ప్రశ్నలు-జవాబులు'(క్యు అండ్ ఏ) ఉంటాయి. పరీక్షకు ముందు అభ్యర్థుల సమయపాలన..ప్రిపరేషన్..నుంచి రిజిస్ట్రేషన్ చేసుకొనే అంశాల దాకా అవి గైడ్ చేస్తాయి. అందులో ప్రతీ విషయం అత్యంత వివరంగా ఉండడంతో పాటు పరీక్షకు సంబంధించినంత వరకు అది సర్వస్వంలా ఉపయోగపడుతుంది.

ఇక టోఫెల్ పరీక్ష ద్వారా ఒనగూరే ప్రయోజనాలను TOEFL@advantage వివరిస్తుంది.

టోఫెల్‌లో సాధించిన స్కోర్‌కు ప్రపంచంలోని ఏ యూనివర్సిటీలో సీటు వస్తుందన్న విషయాలను toeflgoanywhere తెలుపుతుంది. మీరు చేయాల్సిందల్లా ప్రపంచంలోని ఏ నగరంలో చదవాలని భావిస్తున్నారో,,ఏ యూనివర్సిటీలో చేరాలని భావిస్తున్నారో.. దానికి తెలపడమే! టోఫెల్‌కు హాజరయ్యే వారి పని ఎంతో సులువయ్యే రీతిలో వెబ్‌సైట్‌ను రూపొందించారు. సమాచారాన్ని చాలా లోతుగా స్పృశించారు. అది అన్ని వయో వర్గాలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే.. టోఫెల్‌కు రిజిస్టర్ చేసుకోవడం..ప్లానింగ్..ప్రాక్టీస్ చేసుకొనేందుకు పోర్టల్‌లో టన్నుల కొద్దీ సమాచారం ఉంది. ఇంకేం? ఎందుకాలస్యం? గో టూ www.toeflgoanywhere ఆల్ ది బెస్ట్!

– కిరణ్

డిజైనర్స్ ప్యారడైజ్..

కంటికి ఇంపుగా ఉంటేనే ఏదైనా మనల్ని ఆకట్టుకుంటుంది. మనిషి మొదలుకుని ఉత్పత్తివరకు దేనికైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఆ విషయానికే మనం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం. దానినే డిజైన్ అంటాం. డిజైన్ చేసే వ్యక్తిని డిజైనర్ అంటారు.

డిజైనింగ్ అంత ఆషామాషీ వ్యవహారం కాదు. వస్త్రాల నుంచి వాచీల వరకు అలాగే వివిధ ఇతర ఉత్పత్తుల రూపకల్పనకు డిజైనింగ్ అవసరం చాలా ఉంటుంది. అలాంటి డిజైనింగ్‌ను శాస్త్రీయంగా బోధిస్తున్న సంస్థల్లో అగ్ర భాగాన ఉండేది అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడి).

యూరోప్, ఆసియా దేశాల్లో అగ్రభాగాన ఉండే 25 డిజైనింగ్ సంస్థల్లో ఒకటిగా ఎన్ఐడి అలరారుతోందని అమెరికాకు చెందిన 'ది బిజినెస్ వీక్' పేర్కొంది. ఇది కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలో స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ . ఈ సంస్థలో విద్యనభ్యసించిన విద్యార్థులు తమదైన నాయకత్వ శైలితో వివిధ రంగాల్లో అద్వితీయమైన పాత్రను పోషిస్తున్నారు.

ఎన్ఐడిలో బోధించే విధానం వినూత్నంగా ఉంటుంది. థియరీ, నైపుణ్యం, డిజైన్ ప్రాజెక్టులు అంతకు మించి ప్రత్యక్ష అనుభవానికి ఇక్కడ ప్రాముఖ్యం ఇస్తారు. కటింగ్ ఎడ్జ్ డిజైన్ స్టూడియోలు, స్కిల్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లు, నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్ తోడ్పాటు అడుగడుగునా ఉంటుంది. ప్రాయోజిత డిజైన్ ప్రాజెక్టులను నేరుగా తరగతి గదుల్లోకే తీసుకువస్తారు. అలా విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదునుపెడతారు. ఫలితంగా బయటి ప్రపంచం, అంటే కార్పొరేట్ సంస్థలు తదితరాలు కోరుకునే నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా ఇక్కడి విద్యార్థులు రాటుదేలుతారు.

ముఖ్యంగా గ్రాడ్యుయేషన్ డిప్లొమాకు ఎంపికైన విద్యార్థులు ఫౌండేషన్ ప్రోగ్రామ్‌కు హాజరుకావాలి. దాన్ని విజయవంతగా పూర్తి చేస్తేనే డొమైన్ ఎంపిక చేసుకునేందుకు వీలుపడుతుంది. సెమిస్టర్ జ్యూరీ అందుకు సంబంధించి సిఫార్సు చేస్తుంది. 'అకడమిక్ క్రెడిట్ బేస్డ్ ఎవల్యూషన్ సిస్టమ్' ద్వారా ఇక్కడి విద్యార్థులను బేరీజు వేస్తారు.

డిజైనింగ్‌కు సంబంధించి డిగ్రీ, పీజీ స్థాయిల్లో పలు కోర్సులను అందిస్తోంది. ఆసక్తిని అనుసరించి వీటిల్లో చేరవచ్చు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తుల అమ్మకం: 6 అక్టోబర్, 2009 నుంచి.

చివరి తేది: 28 నవంబర్ 2009.

ప్రవేశ పరీక్ష: 3 జనవరి 2009. మరిన్ని వివరాలకు www.nid.edu వెబ్‌సైట్ చూడండి.

– వాహిని

వివరాలు ఇవిగో

ఐటిఐతో భవిష్యత్తు?

❍ నేను ఐటిఐలో చేరాలనుకుంటున్నాను. తరవాత భవిష్యత్తు ఎలా ఉంటుంది?

– సాయిశ్రీ, మిర్యాలగూడ

ఐటిఐలు రకరకాల టెక్నికల్ డిసిప్లెయిన్‌ల్లో సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నాయి. ఇవి సంవత్సర కాల పరిమితి ఉన్నవి. ఈ సర్టిఫికెట్ తరవాత ప్రభుత్వంలోని వివిధ టెక్నికల్ డిపార్ట్‌మెంటుల్లో కింది స్థాయి ఉద్యోగాలు చేయడానికి అర్హులు. అయితే తరవాత కూడా ఉన్నత చదువులకు అవకాశం ఉంది. దీనితో పాలిటెక్నిక్ పూర్తిచేసి, లేటరల్ ఎంట్రీద్వారా ఇంజనీరింగ్‌లో కూడా చేరవచ్చు.

బయో టెక్నాలజీ అవకాశాలు..

❍ బిటెక్ బయోమెడికల్ ఇంజనీరింగ్‌కు ఎలాంటి అవకాశాలు ఉంటాయి?

– యశ్వంత్, నల్లగొండ

బయోమెడికల్ ఇంజనీర్‌కు మెడికల్ అండ్ ఫార్మాస్యూటికల్ రంగం రెండింటిలో అవకాశాలు ఉంటాయి. సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ తయారీ సంస్థలు, కృత్రిమ అవయవాల తయారీ సంస్థలు, మెడికల్ ల్యాబ్స్, రీసర్చ్ ఆర్గనైజేషన్స్‌లో అవకాశాలు ఉంటాయి. మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ టెస్టింగ్, సేఫ్టీ విభాగాలతోపాటు, సేఫ్టీ స్టాండర్డ్స్ నిర్ణయించే ప్రభుత్వ ఏజెన్సీలు, బయోమెడికల్ డిపార్ట్‌మెంట్స్‌లో కూడా ఉద్యోగాలు ఉంటాయి. కొంత అనుభవం వచ్చిన తరవాత కొన్ని కంపెనీలకు కన్సల్టెంటుగా కూడా పనిచేయవచ్చు.

ఎంబిఏనా? బిఈడా?

❍ తెలుగు మీడియంలో డిగ్రీ చదివాను. ఎంబిఏ చేయాలా? బిఈడి చేయాలా అని తేల్చుకోలేకపోతున్నాను? సలహా ఇవ్వగలరు?

– రమేష్‌బాబు, బాపట్ల

టీచింగ్‌లో కెరీర్ ఉండాలనుకునేవారు చేయాల్సిన కోర్సు బిఈడి. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో టీచింగ్ చేయాలంటే బిఈడి కనీసం 45 శాతం మార్కులతో డిగ్రీపూర్తి చేసినవారు బిఈడి చేయడానికి అర్హులు. బిఈడి తరవాత ఎంఇడి చేయవచ్చు. దేశంలో టీచింగ్ కోర్సుకు సంబంధించిన వ్యవహారాలను 'నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సిటిఇ)' పర్యవేక్షిస్తుంది. ఇది కాకుండా ప్రైమరీ, నర్సరీ విద్యార్థులకు బోధించాలంటే డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(డిఇడ్) చేసి ఉంటే సరిపోతుంది. దీనిలో చేరాలంటే ఇంటర్ పూర్తిచేసి ఉంటే చాలు. ఈ కోర్సుల్లో చేరడానికి ఎంట్రెన్స్ రాయాల్సి ఉంటుంది. ఈ కోర్సు పూర్తిచేసిన తరవాత టీచింగ్‌లోకి ప్రవేశించవచ్చు. ఒకటి రెండు సంవత్సరాలు అనుభవం సంపాదించుకున్న తరవాత ఎంబిఏలో చేరవచ్చు. ఈలోపు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ స్కిల్స్‌ను పెంచుకోండి. ఆ తరవాత మీ ఆసక్తిని బట్టి మీకు ఇష్టమైన స్పెషలైజేషన్‌తో ఎంబిఏను ఎంచుకోవచ్చు. టీచింగ్‌లోనే ఉండాలంటే ఎంఫిల్, పిహెచ్‌డిలు చేసి ఇంకా కెరీర్‌లో ఎదగవచ్చు.

– గోవర్ధనం కిరణ్‌కుమార్

చిరునామా: **వివరాలు ఇవిగో,** కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

రైటింగ్ స్కిల్స్

రాయడం ఒక కళ..

అక్షరం అనల్ప శక్తిమంతం. అక్షరం అందమైన పదాలకు మూలం. అలాంటి పదాలు కలిస్తే వాక్యం. 'వాక్యం రసాత్మక కావ్యం' అన్నారు పెద్దలు. 'లిఖిత పూర్వకంగా' అన్న పదానికి శాసనమంతటి శక్తి ఉంది. అందుకే నాలుగు మాటలు అటూ ఇటూ అయినా ఫర్వాలేదు. రాత అయితే..తలరాతే మారవచ్చు. నిజానికి రాయడం ఒక గొప్ప కళ. చరిత్ర ప్రతి మార్పు వెనకా బలీయమైన అక్షరం ఉంది. విద్యార్థి ఎదుర్కొనే పరీక్షల నుంచి దేశాల మధ్య జరిగే యుద్ధాల దాకా లిఖిత మాధ్యమం పోషించే పాత్ర చాలా పెద్దది. అందుకే చక్కగా, శక్తిమంతంగా రాయడం గురించి నాలుగు మాటలు..

జాగ్రత్తగా రాయాలి

అన్యమనస్కంగా రాయకపోవడమే ఉత్తమం. మౌఖిక మాధ్యమం కన్నా లిఖిత మాధ్యమం చాలా ప్రధానమైంది. అందుకే తప్పులు లేకుండా రాసేందుకు ప్రాధాన్యతనివ్వాలి. సరైన రీతిలో రాయడం వెనక చాలా సవాళ్లు ఉంటాయన్న విషయం మరువరాదు. అక్షర దోషాలు, వ్యాకరణ దోషాలు రాకుండా చూసుకోవాలి. సంజ్ఞా చిహ్నాలను సరిగ్గా ఉపయోగించాలి. సరైన పదాలను ఉపయోగించడంతో పాటు ఎవరికి వారు సొంత శైలిని నిర్మించుకోవడం అత్యంత అవసరం.

పడికట్టు పదాలు వద్దు: జనబాహుళ్యంలో విస్తృతంగా మౌఖిక రూపంలో ఉండే పడికట్టు పదాలకు, పద బంధాలకు దూరంగా ఉండడమే మేలు. ప్రత్యేక సందర్భాల్లో మినహా పదాల క్లుప్త రూపాలను వీలైనంత పరిహరించండి. వివిధ ప్రదేశాలు, వ్యక్తులు, సంస్థల పేర్లు రాయాల్సి వచ్చినప్పుడు దోషాలు లేకుండా చూసుకోవాలి. ప్రపంచంలో ఏ వ్యక్తి అయినా అత్యంత ప్రేమించేది తన పేరునే. దానిని ఖూనీ చేయడం తగదు. అంకెలను రాసేప్పుడు 10 లోపు ఉన్న వాటిని అక్షరాలలో రాయడమే మంచి పద్ధతి. వ్యక్తుల ప్రకటనలను..లేదా ఏదేని సమాచార గ్రంథంలోని విషయాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పే సందర్భంలోనే కొటేషన్ చిహ్నాలు వాడండి. అన్నింటి కన్నా అత్యంత ముఖ్యమైన విషయం-వీలైనంతగా చిన్న వాక్యాలను రాయడం.

ఇక రాయడంలో చాలా పద్ధతులుంటాయి. నిజానికి అది ఒక విస్తృతమైన అంశం. సాధారణ లేఖలు..నివేదికలు..సృజనాత్మక రచనలు..వార్తలు..వ్యాసాలు..పరీక్షల్లో జవాబులు..ఇలా వేటికవే ప్రాధాన్యతాంశాలు. పరీక్షల్లో జవాబులను కవితారూపంలో రాస్తే అసలుకే ఎసరు వస్తుంది. నివేదికలకు భాషాడంబరం అవసరం లేదు. ఏదైనా సూటిగా..క్లుప్తంగా, మనస్సుకు హత్తుకునేలా రాయడం బాగు.

స్వాతంత్ర్య సమరంలో భాగంగా జైలుకు వెళ్లిన తండ్రి తన చిన్నారి కూతురుకు రాసిన లేఖలు జగద్విఖ్యాతి పొందాయి. ఒక తండ్రి తన చిన్నారి కూతురుకు ఉత్తరాలు 'ఇలా సైతం రాయవచ్చు' అని ప్రపంచ ప్రజకు విడమర్చి చెప్పావవి. సమాజం, శాస్త్రం, చరిత్ర, మానవ సంబంధాలు లాంటి ఎన్నో అంశాలను సున్నితంగా, సూటిగా, సరళంగా రాయడం ఎలాగో నేర్పిన లేఖా సాహిత్యమది. ఆ తండ్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని..ఆ కూతరు ఇందిరా ప్రియదర్శిని అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు కదా!

ఉత్తరాల రాత

ఉత్తరాలు రాసేప్పుడు ఎవరికి రాస్తున్నామో వారిని ఉద్దేశించడం ముఖ్యం. 'ప్రియమైన..' అని ప్రారంభించడం ఎంత ముఖ్యమో, మీ../ప్రేమాస్పదుడు/విధేయుడు/మిత్రుడు/ శ్రేయోభిలాషి .. లాంటి ముగింపు పదాలు రాయడం అంతే ముఖ్యం. మీరు ఒక వ్యక్తి పేరిట కాకుండా హోదా పేరిట ఉత్తరం ప్రారంభిస్తే..నమస్కృతులతో అని ముగించడం బావుంటుంది. ఏదైనా విషయం గురించి లేఖ రాసేప్పుడు ముఖ్యమైన అంశాలను ఉత్తరం తొలి పేరాలోనే వివరించేందుకు యత్నించాలి. ఉత్తరంలో రాసే విషయాల్లో స్పష్టత ఉండాలి తప్ప గందరగోళం ఉండకూడదు. అసలు విషయం ఏమిటో అర్థం కాక ఒకటికి నాలుగుసార్లు లేఖను చదవాల్సిన పరిస్థితులు ఉత్పన్నం కాకూడదు.



సరిచూసుకోవడం

ఏ అంశంపైనైనా సరే..ఏది రాసినా సరే..రాసింది రాసినట్లు పంపించకుండా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవడం మంచి పద్ధతి. తద్వారా, అక్షరదోషాలు, భాషా దోషాలు, అన్వయ దోషాలు, విషయ దోషాలను సరిదిద్దుకునే వీలు కలుగుతుంది. రాయడంలో ఒక 'అలిఖిత' నియమం ఉంది. అది..రాతలో అన్నీ వాస్తవాలు మాత్రమే ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. మీరు ఇంగ్లిష్‌లో రాస్తే..అదీ మీ కంప్యూటర్‌లో కంపోజ్ చేస్తే..ఒక్క క్షణం! మ్యాటర్ మొత్తం హైలైట్ చేసి స్పెల్ చెక్, గ్రామర్ చెక్ లాంటి టూల్స్‌లోకి వెళ్లండి. అప్పుడు అండర్‌లైన్ అయ్యే ప్రతీ పదాన్ని జాగ్రత్తగా చూసుకోండి. సాంకేతిక పరిజ్ఞానం తెచ్చిన కొత్త వెసులుబాటు ఇది. దానిని సద్వినియోగం చేసుకోవడం అవసరం. అలా అని పూర్తిగా యంత్రంపైనే ఆధారపడితే..భాష కాస్త యాంత్రికంగానే మారే ప్రమాదం ఉంది. కాబట్టి- ఒక మంచి నిఘంటువుతో పాటు పర్యాయపద నిఘంటువును సైతం అందుబాటులో పెట్టుకోవాలి.

ఈ జాగ్రత్తలను పక్కనపెడితే..రాయాల్సిన విషయాన్ని సూటిగా, క్లుప్తంగా, సరళంగా రాయడం ముఖ్యం. చెప్పదల్చుకున్న అంశాలను ఎంత క్లుప్తంగా వివరిస్తే అంత మంచిది. పేజీలు నింపితేనే విషయంలో 'బరువు' ఉంటుంది అనుకోవడం భ్రమ మాత్రమే! అలా చేయడం 'డొల్ల'తనానికి దారి తీసే ప్రమాదం పొంచి ఉంది. ఏ విషయాన్ని అయినా చక్కగా రాయాలంటే అందుకు విస్తృత అధ్యయనం అవసరం. ఎంత అధ్యయనం చేస్తే అంత బాగా రాయవచ్చునన్న విషయం తప్పనిసరిగా గుర్తించాలి. ఎవరికి వారు రాత్రికి రాత్రి పండితులయి పోరు. శ్రద్ధగా కృషి చేస్తే అసాధ్యం ఏదీ ఉండదన్న విషయాన్ని గట్టిగా విశ్వసించి ఆ దిశలో ముందుకు సాగాలి. అప్పుడు ఎవరినైనా మెప్పించవచ్చు. విజయానికి అడ్డదారులు ఉండవు. ఆల్ ద బెస్ట్!

– ఎల్.శంభాజీ